


# గగనసీమ

**కొందరు రచయితలు** సాలెపురుగుల్లాంటివారు. ఆలోచనలు వారిలోంచే పుడతాయి

మరికొందరు రచయితలు చీమల్లాంటివారు. దొరికిందంతా సంగ్రహించి దాచి తర్వాత ఉపయోగిస్తారు.




ఇంకొందరు రచయితలు తేనెటీగల్లాంటివారు. అనేక పూలనించి మకరందాన్ని సేకరించి మధురమైన తమ స్వంత తేనెని తయారుచేస్తారు.

నేను రాసిన చాలా నవలల్లోలాగా నేను గగనసీమ విషయంలో సాలెపురుగుని, చీమని, తేనెటీగని కూడా.

అమెరికా నేపథ్యంలో రాసిన ఆఖరి, మూడో నవల గగనసీమ. మొదటి రెండూ గ్రీన్‌కార్డ్, అంకుల్ సామ్. మా పెద్దక్క కొడుకు జె.వి.ఎస్ ప్రసాద్ 1992లో అమెరికాకి వెళ్ళాలనుకున్నాడు. అతన్ని గైడ్ చేయడానికి నేను యునైటెడ్ స్టేట్స్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ వారి లైబ్రేరియన్‌కి అమెరికా వలస విధానం మీద పుస్తకాలు ఉంటే పంపమని ఉత్తరం రాసాను. రెండు పుస్తకాలు నాకు పోస్ట్‌లో అందాయి. వాటిలో అమెరికా ప్రభుత్వం మంజూరు చేసే వివిధ వీసాలు, వాటి నిబంధనలు ఉన్నాయి. ఆ రెండిటినీ పాఠ్యపుస్తకాల్లా చదివాను. మా వాడికి బిజినెస్ వీసా ద్వారా వెళ్ళడానికి అర్హత ఉందని తెలిసింది. ఆ సందర్భంగా కె - 1 వీసా గురించి చదివాను. అది కాబోయే జీవిత భాగస్వామిని అమెరికన్ పౌరుడు అమెరికాకి రప్పించుకునేందుకు ఇచ్చే వీసా. దాని నిబంధనలు చదివాక అందులో నాకు జీవితం, నాటకీయత కనిపించాయి.

కమర్షియల్ నవలకి ఓ గ్రాఫ్ ఉంటుంది. మొదటి పదిపేజీల్లోగా ఆ నవల్లోని ప్రధాన సమస్య పాఠకుడికి తెలియాలి. దాన్ని పరిష్కరించడానికి చేసే ప్రయత్నాలు విఫలం అవుతూ చివరకి క్లైమాక్స్‌కి చేరుకునే దాకా అది పరిష్కరించబడక పోవడంతో పాత్ర లేదా పాత్రలు తీవ్ర కష్టాల్లో పడాలి. వాళ్ళు పూర్తిగా చితికిపోయేలోగా అది పరిష్కరించబడి వారి కథ సుఖాంతం అవాలి. ఈ క్రమంలో పాఠకుడు సమస్యలో

చిక్కుకున్న పాత్రతో మమేకమై, ఎలా అందులోంచి ఆ పాత్ర బయటపడుతుందా అని తెలుసుకోడానికి ఆసక్తిగా చదవాలి దీన్నే సస్పెన్స్ అంటాం. ఇవన్నీ ఉన్న నవల పాఠకుడికి నచ్చే నవల అవుతుంది. కె-1 వీసాలో ఇవన్నీ తీసుకువచ్చే నాటకీయత నాకు కనిపించింది.

ఆ వీసాకి సంబంధించిన పేజీలని జెరాక్స్ తీసుకుని తిరిగి ఆ పుస్తకాలని వెనక్కి పంపించేసాను. వారు పుస్తకాలు పంపిన కవర్నే ఉపయోగించి పంపాలి. ఎందుకంటే దాని గోడల్లో మెత్తటి పీచు నింపి ఉండి, లోపలి పుస్తకం రవాణాలో దెబ్బతినదు.

అప్పుడే తెలుగు విద్యార్థులు ఎం.ఎస్ చేయడానికి అమెరికాకి వెళ్ళడం ఊపందుకుంది. శ్రీసి.సి రెడ్డి విసు కన్సల్టెన్సీ అనే సంస్థని స్థాపించి, అమెరికాకి పై చదువులకి వెళ్ళే విద్యార్థులకి టోఫెల్, జిమేట్‌లాంటి పరీక్షల్లో శిక్షణ ఇవ్వడం కూడా ఆరంభమైంది. ఆ నేపథ్యంలో నేను ఓ కథని తయారుచేసుకున్నాను.

ఓ రోజు శ్రీ ఇంద్రగంటి శ్రీకాంత్‌శర్మగారి నించి ఆంధ్రప్రభ ఆఫీస్‌కి వచ్చి తనని కలవమని నాకు ఫోన్ వచ్చింది.. నా క్లాస్‌మేట్, నటుడు సుత్తి వీరభద్రరావు పోయినప్పుడు చూడటానికి వెళ్తే అక్కడే ఉన్న ఆయన్ని నాకు జంధ్యాలగారు పరిచయం చేసారు. అప్పట్లో ఆలిండియా రేడియో, విజయవాడలో పనిచేసేవారు. వీరభద్రరావు రేడియోలో తనకి పరిచయం అని చెప్పారు.

లోయర్ టేంక్‌బండ్‌లో ఉన్న ప్రభ ఆఫీస్‌కి వెళ్ళేసరికి అక్కడ ఆయన, శ్రీరమణగారు ఉన్నారు. వారిద్దరికీ కొన్నేళ్ళ క్రితం ఆంధ్రజ్యోతిలో ఎడిటోరియల్ శాఖలో పనిచేసినప్పుడు పరిచయం. శ్రీకాంత్ శర్మగారు తను రేడియోలో లాంగ్ లీవ్ తీసుకుని ఆంధ్రప్రభ వారపత్రికకి ఎడిటర్ అయ్యానని, శ్రీరమణ సబ్ ఎడిటర్‌గా చేరారని చెప్పారు. తమ వారపత్రికకి సీరియల్ కావాలని అడిగారు. నేను రెండు కథలని చెప్పాను. వాటిలో ఆయనకి కె-1 వీసా నేపథ్యంలోని కథ నచ్చింది. 1998 దీపావళి సంచిక నించి ఆంధ్రప్రభలో అది మొదలైంది.

హీరోయిన్ కోనసీమకి చెందింది. ఇండియాని వదిలి పరాయి సీమకి వెళ్తుంది. కథలో ప్రధాన భాగం అక్కడే జరుగుతుంది కాబట్టి గగనసీమ అనే పేరు తట్టింది. అందులోనే హీరోయిన్ పేరు గగన దొరికింది. పైగా ఆమె గగనంలో ప్రయాణం చేసి అమెరికా వెళ్తుంది కదా. ఆకాశం, భూమి. గగన అక్క పేరు భువనగా పెట్టాను.

సూక్ష్మంగా కథ. అతి బీద కుటుంబంనుంచి వచ్చిన గగన అక్కలిద్దరికీ పెళ్ళిళ్ళు కాలేదు. గగన చదువులో చురుగ్గా ఉండటంతో ఆమె తండ్రి స్నేహితుడు సుదర్శనం ఆమెని ఇంజనీరింగ్ చదివించాడు. అమెరికాలో ఎం.ఎస్ చేయడానికి రెండుసార్లు వీసాకి వెళితే, ఆమె బీదది అవడంతో తిరిగి ఇండియాకి రాదన్న క్రైటీరియాతో వీసా తిరస్కరించబడింది. వీసా దొరకని ఆమె స్నేహితురాలు జనని వెళ్ళిన మార్గంలోనే గగన అమెరికాకి వెళ్తుంది. కె-1 వీసా మీద.

జనని అమెరికా రావడానికి సహాయం చేసిన బ్రోకర్ గగనకి కూడా ప్రోనోట్ రాయించుకుని సహాయం చేస్తాడు. ఆమెకి చదువులో సహాయం చేసిన సుదర్శనం కొడుకు మనోహర్‌తో ఆమెకి పెళ్ళి జరపాలని నిశ్చయించుకున్నాక సుదర్శనం ధన సహాయం చేసి ఆమెని పంపుతాడు. అమెరికాలోని బీదవాడైన హేరీ బేకర్ గగనని పెళ్ళిచేసుకోడానికి కె-1 వీసాద్వారా అమెరికాకి రప్పిస్తాడు. ఇందుకు అతనికి ఆ బ్రోకర్ రెండున్నర వేల డాలర్లు చెల్లిస్తాడు. అమెరికాలోని ఇమిగ్రేషన్ అండ్ నేచురలైజేషన్ సర్వీస్ (ఐ.ఎన్.ఎస్)లో పని చేసే ఏజెంట్ జేమ్స్ మిల్లర్ అక్రమంగా అమెరికాలోకి ప్రవేశించిన వారిని పట్టుకుని వెనక్కి పంపే విభాగంలో పనిచేస్తూంటాడు. అతని దగ్గరకి గగన, హేరీల ఫైల్ వస్తుంది. మొదట్లోనే అతనికి అనుమానం కలుగుతుంది. ఆమె విమానం దిగేసరికి అతను ఆమెను చూడటానికి అక్కడ ఉంటాడు. హేరీతో వెళ్ళే ఆమెని అనుసరిస్తాడు. అక్కడ నించి పిల్లి ఎలుక ఆటలా కథ సాగుతుంది. ఆమె అతన్ని వీసా కోసమే చేసుకుందని, వారిద్దరూ భార్యాభర్తల్లా జీవితాన్ని గడపడం లేదని ఋజువు చేసే వివిధ ప్రయత్నాలని జేమ్స్ చేస్తుంటాడు. ఆ జంట పట్టుబడబోయి తర్వాత విజయవంతంగా వాటిని ఎదుర్కొంటూంటారు. ఈ క్రమంలో వాళ్ళిద్దరూ ఒకరితో మరొకరు ప్రేమలో పడతారు. మనోహర్‌తో ఆమె పెళ్ళి ఏమౌతుంది? జేమ్స్ వాళ్ళని పట్టుకుంటాడా? ఇవి నవల్లో ఉత్కంఠని రేకెత్తించే రెండు ప్రశ్నలు. ప్రభ వారపత్రికలో సీరియల్‌గా రాసేప్పుడు తర్వాత ఏమవుతుంది? అనే చోట సీరియల్‌ని ఆపేవాడిని. దాంతో సీరియల్ సక్సెస్ అయింది. చివరకి జేమ్స్

విజయవంతంగా దానికి ఋజువులు సంపాదించి గగనని డిపోర్ట్ చేయడానికి విమానాశ్రయానికి తీసుకెళ్తాడు. తర్వాత కథ సుఖాంతమా? దుఃఖాంతమా? మీరీపాటికి నవల చదివే ఉంటారు.

నా రచనా జీవితంలో మొదటిసారి, కంపోజిటర్స్‌కి నా చేతిరాత అర్థం కావడంలేదని, సీరియల్‌ని ఫెయిర్ చేయించి ఇవ్వమని శ్రీరమణ కోరారు. వారంతా గతంలో నా చేతిరాతని అర్థం చేసుకున్నవారే. కాదనలేదు. నా రాతని చక్కగా అర్థం చేసుకునే పద్మజ ఫెయిర్ చేసేది.

రచయిత వ్యక్తిగత అభిప్రాయాలు, జీవితంలోని అనుభవాలు అతని రచనల్లో చోటు చేసుకుంటాయన్నది వాస్తవం. అప్పట్లో శ్రీకనకాల దేవదాసుగారి స్వగ్రామం యానాం వెళ్ళినప్పుడు గోదావరిపాయ అవతల ఉన్న కోనసీమలోని ఎదుర్లంకకి పడవలో వెళ్ళాం. గగనసీమలో హీరోయిన్ గగన స్వగ్రామం ఎదుర్లంకగా రాసాను. మద్రాస్‌లో మా పిన్నమ్మ సావిత్రి కుటుంబం కొత్వాల్ సావిడిలో అద్దెకి ఉండేది. గగన, ఆమె తండ్రి ప్రభాకర శాస్త్రి మద్రాస్‌కి అమెరికన్ వీసా ఇంటర్వ్యూకి తీసుకెళ్ళినప్పుడు దిగిన బంధువుల ఇల్లు కూడా కొత్వాల్ సావిడిలో ఉందని రాసాను. ఈ నవల్లో నేను రాసిన ఐ.ఎన్.ఎస్ ఎడ్రస్‌లు, ఫోన్ నంబర్లు నిజమైనవి. ఆ సమాచారాన్ని సేకరించి నవల్లో యథాతథంగా రాసాను.

మార్చ్ 1999లో లిపి పబ్లికేషన్స్ ద్వారా ఇది నవలగా వెలువడింది. 224 పేజీలు వెల రూ.50/- ద్వితీయ ముద్రణ వెలువడలేదు. ఇది ప్రస్థుతం మార్కెట్లో లేదు. నవల చివర్లో అమెరికాకి వెళ్ళే విద్యార్థులకి ఉపయోగించే చాలా సమాచారం ఇచ్చాను. అది అమెరికన్ కన్సులేట్ నించి వచ్చిన ఓ పుస్తకంలోంచి తీసుకున్న సమాచారం. ఇది చదివే మీరు అమెరికాకి వలస వచ్చి ఉంటే బహుశ అమెరికా రాబోయే ముందు ఆ సమాచారం ఉపయోగించుకుని ఉండరని నా నమ్మకం. ఎందుకంటే అది మీ దృష్టిలో పడి ఉండకపోవచ్చు. ఆ రోజుల్లోని యువత నవలలు చదివే తరానికి చెందింది కాదు. మీరు ఆ సంధికాలంలో పుట్టి ఉంటారు.

గగనసీమకి సంబంధించిన ఓ విశేషం అది పుస్తకంగా వెలువడ్డాక జరిగింది. 1999 ఆగస్ట్ నెలనుకుంటాను. విజయవాడలోని మిత్రులైన జయంతి పబ్లికేషన్స్ బుక్‌షాప్ యజమాని శ్రీ పెరుమాళ్ళునించి వినాయక చవితి ముందు రోజు ఉదయం నాకు ఫోన్ వచ్చింది. 'మీరు అమెరికా నేపథ్యంలో ఇటీవల ఓ నవల రాసారా?' అని అడిగారు. రాసానంటే, 'అందులో నమస్తే అనే రెస్టరెంట్ పేరు రాసారా?' అని అడిగారు. రాసానని చెప్పాను.

"దాని యజమాని అది తనని ఉద్దేశించి రాసారని భావిస్తున్నారని, తన గౌరవానికి భంగం కలగడంతో మీమీద చట్టరీత్యా చర్య తీసుకోదలచుకున్నారని నవోదయ బుక్ షాప్ యజమాని శ్రీ రామ్మోహనరావు చెప్పారు. ఆ రెస్టరెంట్ తాలూకు వారి బంధువు ప్రస్థుతం విజయవాడలో ఉన్నారు. మీరు వచ్చి కలిసి వివరణ ఇవ్వాలని లేదా కోర్టుకి వెళ్తారని తెలియచేయమని చెప్పారు." శ్రీ పెరుమాళ్ళు వివరించారు.

మర్నాడు వినాయకచవితి కాబట్టి పండగ మర్నాడు వస్తానని చెప్పాను. కొద్దిసేపాగి మళ్ళీ పెరుమాళ్ళుగారు ఫోన్ చేసి మర్నాడే రావాలని, ఆ మర్నాడు మధ్యాహ్నం రెండు తర్వాత ఆ బంధువు విజయవాడలో ఉండక మైలవరం వెళ్తారని, ఈలోగా వస్తే రామ్మోహన్‌రావుగారి సమక్షంలో అంతా జరగడం మంచిదని సలహా చెప్పారు.

అలా మొదటిసారి ఆ పండగకి ఇంట్లో లేకుండా వెంటనే విజయవాడ బయల్దేరాల్సి వచ్చింది. పిల్లలతో వినాయకచవితి పూజని మిస్ చేయించడం మిస్ అవడం నన్ను చాలా బాధించింది. పండగరోజు పొద్దున్నే బయలుదేరి విజయవాడకి పన్నెండుకి చేరుకున్నాను. పెరుమాళ్ళు, రామ్మోహన్‌రావుగార్లతో కలిసి లాస్‌ఏంజెలెస్ నించి వచ్చిన ఆ బంధువు ఇంటికి వెళ్ళాను. లాస్‌ఏంజెలెస్‌లో నమస్తే రెస్టరెంట్ తమదని, తమ అనుమతి లేకుండా ఆ పేరు నవల్లో ఎందుకు పెట్టారని ఆవిడ కోపంగా అడిగారు. ఎయిర్ ఇండియా ప్రయాణీకుల కోసం ప్రచురించే పత్రిక పేరు నమస్తే అని, ఆ పేరు అందులోంచి తీసుకున్నానని, లాస్ ఏంజెలెస్‌లో ఆ పేరు గల రెస్టరెంట్‌కి నేను ఎన్నడూ

రాలేదని చెప్పాను. అందులో రాసిన కొన్ని చట్టవ్యతిరేక కార్యక్రమాల గురించిన సమాచారం నాకు ఎలా తెలిసిందని కూడా అడిగారు. అప్పటికే మానసికంగా విసిగిపోయిన నేను, అది రచయిత ప్రివిలేజ్ అని, చెప్పనని చెప్పాను. మధ్యవర్తిత్వానికి వచ్చిన ఇద్దరూ చెప్పమనడంతో 'మద్రాస్‌లోని అమెరికన్ కన్సులేట్ వారి లైబ్రరీ నించి వచ్చిన పుస్తకం చదివాక వచ్చిన ఊహల్లోంచి' అని చెప్పాను. ఎటూ అచ్చయింది. ఈసారి ముద్రణలో ఆ రెస్టొరెంట్ పేరు తీసేయాలని రామ్మోహనరావు సూచించి దాన్ని అంతటితో ముగించారు.

ఆవిడ ఇగో సేటిస్‌ఫేక్షన్ కోసమే పిలిపించిందని తిరిగి మేము వెళ్తున్నప్పుడు పెరుమాళ్ళుగారు ఆవిడని తిట్టారు. రచయితగా నాకు కొన్ని నవలలకి ఇలాంటి ఇబ్బందులు ఎదురయ్యాయి.

తెలుగు సినిమా తెరకి ఉపయోగపడే ఓ చక్కటి కథని తెలుగు పరిశ్రమ ఉపయోగించుకోలేదు అనే అభిప్రాయం ఈ నవల విషయంలో నాలో ఉంది. అమెరికా నేపథ్యంలో తర్వాత చాలా తెలుగు సినిమాలు వచ్చినా వాటిలో ఇంతటి పటుత్వమైన కథ లేదని చెప్పడానికి కారణం అభిజాత్యం కాదు. అవన్నీ టైలర్-మేడ్-స్క్రీన్-స్టోరీస్ మాత్రమే. దీంట్లోని నాటకీయత, జీవితం ఆ కథల్లో లేదనే చెప్పాలి.

Post your comments

www.anandbooks.com
www.telugubooks.in

*ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి*